క్లుప్తంగా

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

గండేపల్లి: విద్యార్థులు రక్షా బంధన్ పర్వదినం నుంచి తమ సోదరుల పేరిట మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ ఎన్. సతీష్‌రెడ్డి పిలుపునిచ్చారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత వృక్షాబంధన్‌కు ప్రాధాన్యం ఇచ్చి ప్రకృతిని పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రో చాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ చాన్సలర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్స్ ఎస్.రమాశ్రీ, ఆదిరెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గాంధారమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ

ఏలేశ్వరం: పట్టణంలో భక్తుల కోరిన కోర్కెలు తీర్చే గాంధారమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. స్థానిక ఏలేరు ప్రాజెక్టు సమీపంలో దాతల సహకారంతో అమ్మవారి ఆలయం నిర్మించారు. పట్టణానికి చెందిన కోరాడ వీర్రాజు ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ మండల అధ్యక్షుడు అలమండ దుర్గావెంకట ప్రసాద్, సూర్యనారాయణమ్మ దంపతుల చేతుల మీదుగా ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

కోటనందూరు: మండలంలోని కాకరాపల్లి కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా రంగులు, విద్యుద్దీపాలతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. వేదపండితులు అమ్మవారికి చండీసప్తసతి హోమం, పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి దుర్గమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం భారీ అన్నదానం నిర్వహించారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో పూజలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో అమ్మవారి ప్రత్యేక అభిషేకాలు, చండీహోమం నిర్వహించారు.

ఏదీ చంద్రన్న బీమా!

- కొనసాగుతున్న హామీల బుట్టదాఖలు పథకం
- బీమా పథకంపై వెలువడని విధి విధానాలు
- 14 నెలలు గడుస్తున్నా ఇంకా ఎదురుచూపులే
- ఇప్పటికీ తెరచుకోని వెబ్‌సైట్
- గత ప్రభుత్వంలో పండగ వాతావరణంలో రూ.కోట్లలో బీమా చెక్కుల పంపిణీ


గుట్టగా పడి ఉన్న చంద్రన్న బీమా బ్రోచర్లు

కాకినాడ సిటీ: ఎన్నికల ముందు అధికారం కోసం అమలు కాని హామీలివ్వడం, గద్దెనెక్కగానే వాటిని విస్మరించడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. 2014లో అమలైన హామీల బుట్టదాఖలు పథకం 2024లోనూ కొనసాగిస్తున్నట్టుంది. వైఎస్సార్ సీపీ హయాంలోని పథకాలకు పేర్లు మార్చేసి సరిపెట్టేశారు. కుటుంబాల్లో చనిపోయిన వారికి ఇస్తామన్న చంద్రన్న బీమా పథకం అమలును కూటమి ప్రభుత్వం. కుటుంబ పెద్దను కోల్పోయిన పేద కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటి వరకు ఈ పథకం విధి విధానాలు ప్రకటించలేదు. సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబాలకు రూ.10 లక్షలు అందిస్తామని ఎన్నికల ముందు ప్రజలకు హామీ ఇచ్చారు. దారిద్ర్యరేఖ దిగువన ఉన్నవారు, అంత్యోదయ, తెల్లరేషన్ కార్డులు కలిగిన వారంతా ఈ పథకానికి అర్హులు. ఏడాది కాలంగా వివిధ కారణాలతో మృత్యువాత పడిన వారు సుమారు 244 మందికి పైగా ఉన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ కాలంలో 417 మందికి, అర్బన్ నియోజకవర్గంలో 217 మంది కుటుంబాలకు బీమా నిధులు అందజేశారు. ఇప్పుడు ఈ బీమా పథకం అమలు చేస్తారో లేదోనని ఆయా కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయి.

2024 మే తర్వాత కూటమి ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకం వెబ్‌సైట్‌ను తొలగించింది. ఆ తర్వాత చంద్రన్న బీమాగా మార్చినా వెబ్‌సైట్‌ను ప్రారంభించలేదు. మృతి చెందిన కుటుంబాల నుంచి క్లెయిమ్‌లను స్వీకరించేందుకు మార్గదర్శకాలు కూడా ఇవ్వలేదు. బీమా దరఖాస్తులను స్వీకరించేందుకు ఇప్పటి వరకు ఎలాంటి ఆదేశాలు లేవని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. దీంతో కుటుంబ యజమానులను కోల్పోయిన బాధిత కుటుంబాలు బీమా కోసం ఎదురు చూస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో 18 నుంచి 50 ఏళ్ల లోపు, 50 నుంచి 60 ఏళ్ల వారు మృతి చెందితే రూ.1 లక్ష నుంచి రూ.5 లక్షల వరకు వైఎస్సార్ బీమా మంజూరయ్యేది. మృతి చెందిన వెంటనే వలంటీర్లు, గ్రామ సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ.10 వేలు ఇచ్చేవారు. మిగతా సొమ్ము 15 రోజుల్లో నామినీ పేరుతో బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యేది. ఈ బీమా సొమ్ము కోసం ప్రభుత్వమే బీమా ప్రీమియం చెల్లించేది. తద్వారా పేద కుటుంబాలకు సత్వర సాయం అందేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ పథకాన్ని గాలికి వదిలేసింది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రూ.10 లక్షల హామీ ఏమైంది?

బీమా పథకంలో సమూల మార్పులు తెస్తాం. అర్హులందరికీ న్యాయం చేస్తాం. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇచ్చిన దానికి రెట్టింపు సాయం అందిస్తామని, ఎన్నికల సమయంలో కూటమి నేతలు హామీలు గుప్పించారు. సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మరణిస్తే రూ.10 లక్షలు ఇస్తామని ఊరూరా ప్రచారం చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ముద్రించి ఇంటింటికీ పంచిపెట్టారు. అధికారం చేపట్టాక ఎప్పటిలానే మరిచిపోయారు. 2024 మే 13వ తేదీ నుంచి బీమా పథకం వివరాలు వెబ్‌సైట్ నుంచి తొలగించారు. తర్వాత నమోదుకు అవకాశం కల్పించలేదు. అప్పటి నుంచి ఎన్నో కుటుంబాలు రోడ్డున పడి బీమా కోసం ఎదురు చూస్తున్నాయి.

పేద కుటుంబాలకు అండగా

గత ప్రభుత్వ కాలంలో వైఎస్సార్ బీమా పథకం అమలులో ఉండేది. కుటుంబ పెద్ద సహజంగా మరణిస్తే రూ.2 లక్షలు, ప్రమాదశాస్తు మరణిస్తే రూ.5 లక్షలు వచ్చేవి. దహన ఖర్చులు కింద రూ.10 వేలు అందించేవారు. పేద కుటుంబాలకు ఎంతగానో అండగా ఉండేది.

– కర్రి గంగాచలం, తూరంగి

ఎన్నికల హామీ నెరవేర్చాలి

చంద్రన్న బీమా పేరిట అర్హులకు బీమా అందిస్తామని ఎన్నికల సమయంలో కూటమి నాయకులు హామీ ఇచ్చారు. దీని ప్రకారం బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలి. ఈ బీమా లేని కారణంగా కుటుంబ పెద్ద మరణిస్తే ఆయా కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీ మేరకు ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలి.

– పలివెల వీరబాబు, సీపీఎం నాయకులు, కాకినాడ

దేవదాయ భూమి మెరక పనులపై పరిశీలన


పెనుగుదురులో మెరకచేస్తున్న దేవస్థానం భూమిని పరిశీలిస్తున్న అధికారులు

కరప: మండలం పెనుగుదురులో దేవదాయశాఖకు చెందిన 3.28 ఎకరాల పంటభూమి ఉంది. ఈ భూమిని బొల్లంగి వెంకటేశ్వర ఆలయ అర్చకునికి కేటాయించారు. సదరు భూమిని అర్చకుని నుంచి ఒక రైతు లీజుకు తీసుకున్నారు. కాగా దానికి చుట్టూ ఉన్న భూమిని రియల్టర్లు కొనుగోలు చేసి లే అవుట్లు వేశారు. దీంతో సదరు దేవస్థానం భూమికి నీరు అందని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఆ భూమిని మెరక చేస్తున్నట్టు దేవదాయశాఖ అధికారులకు సమాచారం అందింది. ఈ మేరకు డిస్ట్రిక్ట్ ఎండోమెంట్స్ ఆఫీసర్ (డీఈఓ) కె.నాగేశ్వరరావు, ఇన్‌స్పెక్టర్ వి.ఫణీంద్ర కుమార్, కాకినాడ నూకాలమ్మ గుడి ఈఓ మోర్త మురళీ వీరభద్రరావు, అర్చకునితో కలసి మెరకచేస్తున్న అర్చక మాన్యాన్ని పరిశీలించారు. దేవదాయశాఖ భూమిలో ఎటువంటి అనుమతులు లేకుండా మెరక చేయవద్దని అధికారులు సదరు రైతుకు తెలిపారు. దేవస్థానం భూమిలో ఎటువంటి పనులు జరగకుండా పర్యవేక్షించాలని అర్చకుడిని డీఈఓ నాగేశ్వర రావు ఆదేశించారు.

మార్కెట్‌ను ముంచెత్తిన రాఖీలు


రాఖీలు కొనుగోలు చేస్తున్న అక్కచెల్లెళ్లు

- రాఖీల కొనుగోలుదారులతో కిటకిటలాడిన దుకాణాలు

బోట్‌క్లబ్/కాకినాడ రూరల్: నగరంలో శుక్రవారం రాఖీ క్రయ, విక్రేతలతో సందడి నెలకొంది. శనివారం రాఖీ పౌర్ణమి కావడంతో తమకు కావల్సిన రాఖీలు కొనుగోలుకు దుకాణాలకు అక్కచెల్లెళ్లు రావడంతో పలు ప్రాంతాల్లో రద్దీ నెలకొంది. ఫ్యాన్సీ దుకాణాలు, బుక్‌స్టాల్స్ వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన బల్లలు, గుడారాల్లో రకరకాలు రాఖీలు విక్రయించారు. ఒక్కొక్క రాఖీ రూ.10 నుంచి రూ. 300 వరకూ విక్రయించారు. గతంలో రూ.20 పెట్టిన కొన్న రాఖీ ప్రస్తుతం రూ.40కి పైగా విక్రయిస్తున్నారు. స్థానిక భానుగుడి సెంటర్, అశోక్‌నగర్, పెద్దమార్కెట్, గోల్డ్‌మార్కెట్ సెంటర్, గాంధీనగర్, రామారావుపేట, జగన్నాథపురం తదితర ప్రాంతాల్లో తాత్కాలిక రాఖీలు విక్రయించే షాపులు వెలిశాయి.


కాకినాడ రూరల్ వలసపాకల మెయిన్ రోడ్డులో రాఖీల క్రయ విక్రయాలు

స్వీట్ దుకాణాలు సైతం రద్దీ

రాఖీ పండగ సందర్భంగా అన్నా చెల్లెళ్లు స్వీట్లు కొనుగోలు చేసేందుకు దుకాణాలకు రావడంతో అవి రద్దీగా మారాయి. కొనుగోలుదారులను ఆకట్టుకొనేందుకు రకారకాలు స్వీట్లను దుకాణ యజమానులు అందుబాటులో ఉంచారు.

ఘనంగా స్వామినాథన్ జయంతి


స్వామినాథన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రైతులు, కౌలురైతులు, సంఘ ప్రతినిధులు

కరప: మండలం కొరిపల్లి గ్రామంలో శుక్రవారం ఏపీ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో భారతరత్న, ఫాదర్ ఆఫ్ గ్రీన్ రెవల్యూషన్ పురస్కార గ్రహీత ఎంఎస్ స్వామినాథన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. భారతరత్న స్వామినాథన్ జయంతి వారోత్సవాల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, రైతులు, కౌలురైతులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజశేఖర్, వల్లు రాజబాబు మాట్లాడుతూ ఎకరానికి 5, 10 బస్తాలు పండే సమయంలో స్వామినాథన్ మూడు పదుల వయసులో దేశ జనాభా నిరంతరం పెరుగుతోంది కానీ, భూమి పెరగదు అని గ్రహించి జపాన్, అమెరికా, మెక్సికో శాస్త్రవేత్తలతో కల్సి వరి, గోధుమ వంగడాలపై పరిశోధనలు చేసి, అధిక దిగుబడులు సాధించి ప్రజల ఆకలికేకలు దూరం చేశారన్నారు. దేశంలో ప్రజలకు సరిపడా పండించడమే కాకుండా, విదేశాలకు ఎగుమతి చేసే విధంగా ఆహార పంటలను అభివృద్ధి చేశారని వారు శ్లాఘించారు. 2014లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎమ్మెస్ స్వామినాథన్ ఆధ్వర్యంలో కమిషన్ ఏర్పాటుచేసింది. క్వింటా ధాన్యానికి రూ.2 వేలు ఖర్చవుతోంది కాబటి, దానికి 50 శాతం అదనంగా కలిపి ఆహారపంటలకు ఇవ్వాలని సదరు కమిషన్ సిఫార్స్ చేసింది. ఆ తర్వాత ఆయన కుమార్తె జయతి ఘోష్ కమిషన్ కూడా నియమించారు. ఆ కమిషన్ సైతం అదే చెప్పింది. అయినా నేటికి కూడా స్వామినాథన్ కమిషన్ సిఫార్స్ అమలు చేయడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క కేరళ రాష్ట్రంలో మాత్రమే కమిషన్ సిఫార్సులు అమలు చేస్తున్నారని, దేశమంతా అమలుచేసి ఉంటే నేడు రైతుల ఆత్మహత్యలు ఉండేవి కావన్నారు. ఏపీ కౌలురైతుల సంఘం ప్రతినిధులు, రైతులు నురుకుర్తి నాగేశ్వరరావు, పెంకే సత్యనారాయణ, రెడ్డి భద్రం, పెంకే నారాయణరెడ్డి, అప్పాడ బూరయ్య, దెయ్యాల తాతాజీ, కాదా సత్యనారాయణ, రెడ్డి పెద్దకాపు, పెంకే వెంకటరమణ, పెంకే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కాకినాడ సిటీ: భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా రెండో మహాసభలు సెప్టెంబర్ 30, అక్టోబర్ ఒకటి తేదీల్లో జగ్గంపేటలో జరుగుతున్నాయని ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావులు పేర్కొన్నారు. శుక్రవారం సీఐటీయూ భవనంలో జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు ఉపయోగపడే సంక్షేమ పథకాలను తాము అధికారంలోకి రాగానే ప్రారంభిస్తామని మేనిఫెస్టోలో పేర్కొన్న పవన్ కళ్యాణ్, చంద్రబాబు ప్రస్తుతం వాటి విషయాన్ని మరచిపోయారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా నేటికీ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు అమలు చేయకుండా తాత్సారం చేస్తున్నాని విమర్శించారు. పైగా కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వ ఖజానా నుంచి ఒక రూపాయి ఖర్చు లేకపోయినా, కార్మికులు దాచుకున్న సొమ్ము రూ.3 వేల కోట్లు బోర్డులో మూలుగుతున్నా కూటమి ప్రభుత్వం గాని, నాయకులు గాని స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల సహనాన్ని పరీక్షించే కాలం ముగిసిపోయిందన్నారు. ఇక పోరాటాలకు కార్మికులను సిద్ధం చేయడం కోసమే ఈ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు రాజ్‌కుమార్ వెల్లడించారు. పెద్ద మేస్త్రీలు, కార్మికుల శ్రేయస్సు కోరే పెద్దలు ఆర్థిక, హార్థిక సహకారాలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బోరా సత్తిబాబు, కొల్లి సత్తిబాబు, వానపల్లి శివ, ఆకుల సత్యనారాయణ, మేడిశెట్టి వెంకటరమణ, రాము, కుంచే చిన్న, కండి బాబి, కెంగం బుజ్జి, చంద్రమళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మిక సంఘం ప్రతినిధులు

వనదుర్గమ్మకు చండీహోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం హోమం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి చండీ హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి ప్రసాదాలు నివేదించారు. హోమంలో 30 మంది భక్తులు పాల్గొన్నారు. కాగా సత్యదేవుని ప్రధానాలయంలో దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రధానార్చకుడు ఇంద్రగంటి నిర్సింహమూర్తి ఆధ్వర్యంలో, కనకదుర్గ అమ్మవారికి పరిచారకుడు ప్రసాద్ ఆధ్వర్యంలో పండితులు కుంకుమపూజలు నిర్వహించారు.


వనదుర్గ అమ్మవారికి చండీ హోమం పూర్ణాహుతి దృశ్యం

ఆలయాలకు శ్రావణ శోభ

- అమ్మవారి దర్శనాలకు బారులు తీసిన భక్తులు

బోట్‌క్లబ్: శ్రావణ శుక్రవారం సందర్భంగా నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం ఇంటి వద్ద వరలక్ష్మి పూజ చేస్తుకున్న మహిళలు సాయంత్రం అమ్మవారి దర్శనానికి పలు ఆలయాలకు వెళ్లారు. దీంతో నగరంలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో భారీగా క్యూలైన్‌లు పెరిగిపపోవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి వరకూ భక్తులు అమ్మ దర్శనం కోసం బారులు తీరారు. అమ్మవారు బంగారం చీరలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి గర్భాలయాన్ని వివిధ రకాల పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకొని, మహిళలు ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు చేశారు. ఉచిత దర్శనంతో పాటు రూ.10, రూ.20, రూ.30 క్యూలైన్‌లో భక్తులు బారులు తీరారు. ఉచిత దర్శనం కోసం గంట తరబడి క్యూలైన్‌లో నిలబడి అమ్మవారిని దర్శించుకున్నారు. దాతల సహకారంతో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. స్థానిక సంతచెరువు మార్కెట్‌లోని కనకదుర్గ అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి.


సర్పవరంలో గోదాదేవి అమ్మవారి ఎదుట లక్ష్మి అష్టోత్తరాలు పారాయణం చేస్తున్న మహిళలు


భక్తులతో కిటకిటలాడిన బాలా త్రిపుర సుందరి అమ్మవారి ఆలయం

స్థానిక దేవాలయం వీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఈఓ ఆర్.రాజేశ్వరరావు ఏర్పాట్లు చేశారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వర స్వామి ఆలయంలో ఉషారాజరాజేశ్వరి అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్థానిక శారదాదేవి ఆలయంలోను, ద్వారకానగరలోని కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో భక్తులు విశేషంగా పూజలు నిర్వహించారు.

కరప: మండలంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో ఆచరించారు. శ్రావణమాసంలో ఈ వ్రతమాచరించి, పూజలు చేస్తే పసుపు, కుంకుమలతో పాటు, అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని మహిళల విశ్వాసం. మహిళలు వేకుజామునే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి రకరకాల పిండివంటలు నైవేద్యంగా సమర్పించి, బంగారు రూపు, నూతన వస్త్రాలను అమ్మవారివద్ద ఉంచి నమస్కరించారు. మండలంలోని దుర్గమ్మ ఆలయాలు, పెనుగుదురులోని సంతోషిమాత ఆలయం, కరప విష్ణాలయం, యండమూరులోని వెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కరప దుర్గాదేవి ఆలయంలో అర్చకుడు కొంపెల్ల చక్రధర్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయ కమిటీలు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశాయి. కరప విష్ణాలయంలో అమ్మవారికి ఆలయ అర్చకులు పెద్దింటి గోపాలకృష్ణ, అనంతాచార్యులు, యండమూరు వెంకటేశ్వరస్వామి ఆలయంలో సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లను అందంగా అలంకరించి, అర్చకులు పెద్దింటి సీతారామం పూజాదికాలు చేశారు. పెనుగుదురులోని సంతోషిమాత ఆలయానికి భక్తులు పోటెత్తారు. అర్చకులు కాదా సత్యనారాయణ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని భక్తులు దుర్గాదేవి ఆలయాల్లో అమ్మవారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆలయాలకు పోటెత్తిన భక్తులు

కాకినాడ రూరల్: వరలక్ష్మీ వ్రతం పూజలు అనంతరం మహిళలు అమ్మవార్ల దర్శనాలు ఆలయాలకు పోటెత్తారు. సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయంలో లక్ష్మి స్వరూపం గోదాదేవి అమ్మవారిని మహిళలు పెద్ద ఎత్తున దర్శనం చేసుకున్నారు. అమ్మ వారి ఎదుట కూర్చుని లక్ష్మి అష్టోత్తర శత నామాలు పారాయణం చేశారు. రమణయ్యపేట శ్రీపీఠంలో మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో కరపలోని దుర్గమ్మ తల్లి


సర్పవరంలో గోదాదేవి అమ్మవారు..

బీమా పథకాలపై అవగాహన

శంఖవరం: ప్రమాదాల బారిన పడిన కుటుంబాలకు బీమా సొమ్ము మాత్రమే అండగా నిలుస్తుందని స్థానిక స్టేట్ బ్యాంక్ మేనేజర్ జి.సాయిమనోజ్ అన్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలో శుక్రవారం పీఎంజేజేబీవై, పిఎంఎస్‌బీవై పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ పీఎంజేజేబీవై బీమా సంవత్సరానికి రూ.20, పీఎంఎస్‌బీవై బీమా సంవత్సరానికి రూ.436 చెల్లిస్తే సహజ మరణం తరువాత రూ.2 లక్షలు నామినికి వర్తిస్తాయని సూచించారు. ఇప్పటికే బీమా చేయించుకుని మరణించిన వారికి స్టేట్ బ్యాంక్ ద్వారా అందించామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ ఈగల అప్పారావు పాల్గొన్నారు.